
సాక్షి నిర్మల్

బుధవారం : 27 : నవంబర్ : 2024



బాసర హుండీల లెక్కింపు

బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం ఆలయ అక్షరాభ్యాస మండపంలో లెక్కించారు. 8లో▸



'రాజ్యాంగ' వేడుకల్లో ఎంపీ నగేశ్

ఢిల్లీలోని పాతపార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఎంపీలు నగేశ్, రఘునందన్ రావు, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.4 /14.5

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చల్లగాలులు వీస్తాయి. చలి ప్రభావం కొనసాగుతుంది.

రోడ్డెక్కిన ఇథనాల్ ఉద్యమం

- ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన
- నిరవధికంగా రాస్తారోకో..
- ఎన్‌హెచ్ 61పైనే వంటావార్పు
- రహదారిపై రాత్రి చలిమంట
- గంటలపాటు ఆర్డీవో ఘెరావ్
- భారీగా పోలీసుల మోహరింపు
- స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ



61 నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు

నిర్మల్/దిలావర్‌పూర్: 'మా పచ్చని పంట పొలాల్లో 'ఇథనాల్' చిచ్చుపెట్టొద్దు..' అంటూ నాలుగు ఊళ్లు రోడ్డెక్కాయి. 'ఫ్యాక్టరీ వద్దు.. మాఊరు మాకు ముద్దు..' అని భీష్మించుకు కూర్చున్నాయి. ఆ పల్లెల్లో నుంచి ప్రతి ఇల్లూ తరలివచ్చింది. కనీసం ఇంటికొక్కరు చొప్పున ఆందోళనలో భాగమయ్యారు. దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ ఆ రెండు గ్రామాలు చేపడుతున్న ఆందోళన మంగళవారం ఉధృతమైంది. ఒక్కసారిగా ఆయా గ్రామాల నుంచి పిల్లాజెల్లా, ఆడామగ అందరూ ఉదయం దిలావర్‌పూర్ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. ఫ్యాక్టరీ వద్దంటూ 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆ ఊళ్లకు తోడుగా సమీపంలోని సముందర్‌పల్లి, కాండ్లి, టెంబరేణి, బన్సపల్లి, లోలం తదితర గ్రామాల ప్రజలూ నిరసనలో భాగమయ్యారు. తాము పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, తమ పంటలను దెబ్బతీసేలా ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టొద్దనే కోరుతున్నామని వారు స్పష్టం చేశారు.

పొద్దున్నే కదిలిన ఊళ్లు..

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కొన్ని నెలలుగా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫ్యాక్టరీతో దీర్ఘకాలంలో తమ పంట భూములు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం గ్రామాల బంద్‌తోపాటు తమ నిరసన పైస్థాయి వరకూ తెలుపాలన్న ఉద్దేశంతో 61వ జాతీయరహదారిపై బైఠాయించాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు మంగళవారం ఉదయం తమ ఇంటిపనులు పూర్తిచేసుకుని కనీసం ఇంటికొకరు చొప్పున నిరసనబాట పట్టారు.

అప్రమత్తంగా పోలీసులు..

దిలావర్‌పూర్‌లో పెద్దఎత్తున్న ఆందోళన చేపట్టే అవకాశాలు ఉన్నట్లు నిఘావిభాగాల సమాచారం తెలుసుకున్న ఎస్పీ జానకీషర్మిల ముందుజాగ్రత్తగా మంగళవారం వేకువజామునే భారీగా పోలీసు బలగాలను దింపారు. ఫ్యాక్టరీ సమీపంలోనే దాదాపు మూడు నుంచి 400 మంది పోలీసులను సిద్ధంగా ఉంచారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డితోపాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలందరూ దిలావర్‌పూర్‌కు తరలివచ్చారు. పరిస్థితిని ఎస్పీ జానకీషర్మిల స్వయంగా పర్యవేక్షించారు. ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, శాంతియుతంగానే వ్యవహరించాలని ఆదేశించారు. ఉదయం నుంచి రాత్రివరకూ ఆందోళన కొనసాగుతూనే ఉండటంతో రాత్రి 9 గంటలకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక బలగాలను రప్పించారు. రోప్ పార్టీ పోలీసులు ఆర్డీవోను అక్కడి నుంచి పంపించారు. దీంతో ఆందోళనకారులు కారుపై దాడి చేశారు. దీంతో పోలీసులు చెదరగొట్టడందో అందరూ ఊళ్లోకి వెళ్లిపోయారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి.. గ్రామంలోనే పహారా కాస్తున్నారు.



బందోబస్తు విధుల్లో పోలీసులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఆకట్టుకున్న ప్లకార్డులు..

తాము పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, కానీ తమ పచ్చని పంటపొలాల్లో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమను తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న చిన్నారులు సైతం.. 'ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు.. మాకు మాఊరే ముద్దు' అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. 'కనబడుట లేదు..' అంటూ మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డిల ఫొటోలతో ప్రదర్శించిన ప్లకార్డు అందరినీ ఆకట్టుకుంది.

ఆందోళన సాగిందిలా...

- 10.00: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నుంచి బయలుదేరారు.
- 11.00 : ఆయా గ్రామాల నుంచి దిలావర్‌పూర్ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు.
- 11.30 : దిలావర్‌పూర్, గుండంపల్లితో పాటు సమీపగ్రామాల నుంచి వచ్చినవాళ్లు ఎన్‌హెచ్ 61పై బైఠాయించారు.
- 12.00 : ఎస్పీ జానకీషర్మిల అక్కడికి చేరుకుని పరిస్థితి పర్యవేక్షించారు. ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, ఆందోళన శాంతియుతంగా సాగేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. సాయంత్రం వరకూ అక్కడే ఉండి, స్వయంగా పరిశీలించారు.
- 1.00 : ఆందోళన చేస్తున్న వారికోసం వంటావార్పు మొదలుపెట్టారు.
- 2.00 : ఆందోళనలో బైఠాయించిన వారికోసం కిచిడి, పప్పు చేశారు.
- 3.00 : నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి అక్కడికి చేరుకున్నారు. ఆమెను ఆందోళనలో ఉన్నవారు అడ్డుకున్నారు. రాత్రి 10 గంటల వరకు ఆమెను అక్కడే నిర్బంధించారు.
- 3.30 : ఆయా గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైనే భోజనాలు చేశారు.
- 4.30 : భోజనాల అనంతరం ఇళ్లకు వెళ్లకుండా.. యథావిధిగా రాస్తారోకో కొనసాగించారు.
- 7.00 : జాతీయ రహదారిపైనే చలిమంటలు వేసుకుని కూర్చున్నారు.
- 9.00 : నిజామాబాద్ నుంచి ప్రత్యేక బలగాల రాక
- 10.00 : ఆందోళన కారులను చెదరగొట్టిన పోలీసులు

నిలిచిన వాహనాలు

ముందస్తుగా ఎక్కడా బయటకు చెప్పకుండా ఒక్కసారిగా 'ఇథనాల్ ఆందోళన' రోడ్డెక్కింది. దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలతో పాటు చుట్టుపక్కల ఉన్న సముందర్‌పల్లి, కాండ్లి, టెంబరేణి, లోలం, బన్సపల్లి తదితర గ్రామాల నుంచీ రైతులు, యువకులు ఆందోళనకు తరలివచ్చారు. ప్రధానంగా గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల నుంచి మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చారు. గ్రామాల్లో బంద్‌కు పిలుపునివ్వడంతో బడికెళ్లే చిన్నారులు సైతం తమ తల్లిదండ్రులతో పాటు వచ్చారు. ఒకేసారి దాదాపు మూడువేల మందివరకు రోడ్డుపైకి రావడంతో ఎన్‌హెచ్ 61 కిక్కిరిసిపోయింది. పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

'చలి'ంచని ఆందోళన

ఓవైపు చలి గజగజ వణికిస్తున్నా.. ఆందోళనను మాత్రం వీడలేదు. చలిని దూరం చేసుకునేందుకు కొందరు అక్కడక్కడ 'మంట' పెట్టుకుని కూర్చున్నారు. రాత్రిపూట కూడా రోడ్డుపైనే వంటావార్పులో కిచిడీ చేసుకుని అక్కడే తింటూ రాస్తారోకోనూ కొనసాగించారు.



రోడ్డుపై చలిమంట కాగుతున్న మహిళలు

న్యూస్‌రీల్

తప్పుడు ప్రచారం ఆపండి

- ఆర్జీయూకేటీ విద్యార్థుల వినతి

బాసర: ఆర్జీయూకేటీపై తప్పుడు ప్రచారం ఆపాలని వర్సిటీ విద్యార్థులు కోరారు. ఈమేరకు మంగళవారం బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఆర్జీయూకేటీ విద్యార్థులుగా తాము గర్వపడుతున్నామని తెలిపారు. తమ సమస్యలను నిర్మాణాత్మకంగా పరిష్కరించుకుంటామన్నారు. చిన్న చిన్న సమస్యలను మీడియా పెద్దదిగా చేసి చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం.. వర్సిటీలో ప్లేస్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వీలైతే వర్సిటీ గురించి పాజిటివ్‌గా ప్రచారం చేయాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనాలి

- డీఎం గోపాల్



అంబకంటిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఎం గోపాల్

కుంటాల: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లయ్ డీఎం గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని అంబకంటి, కుంటాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. రైతులు తేమ శాతాన్ని బట్టి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట సెక్రెటరీ భోజేందర్, డైరెక్టర్ సురేశ్, రైతులు ఉన్నారు.

29న దీక్షా దివస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఈనెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే దీక్షాదివసను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, నిర్మల్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన నవంబర్ 29ని మరోసారి యాది చేసుకోవాలని తెలిపారు. దీక్షా దివస్ కార్యక్రమం విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక పాలనను వ్యతిరేకించాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పడకంటి రమాదేవి,పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు డాక్టర్ సుభాష్ రావు, భూషణ్ రెడ్డి, గంగ్రత్ రమేష్ ,లక్ష్మణ చారి, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు ఆర్జీయూకేటీ విద్యార్థులు




ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ

బాసర : బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 2 వరకు తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ కబడ్డీ మహిళా టోర్నమెంట్‌లో పాల్గొంటారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అభినందించారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. మరిన్ని క్రీడా పోటీలకు పంపేందుకు విశ్వవిద్యాలయం తరఫున మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రభాకర్‌రావు, పీడీ శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో మాట్లాడుతున్న సీఎం

నిర్మల్‌చైన్‌గేట్: వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన దొడ్డు, సన్న వడ్లు, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు చెల్లించిన డబ్బుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత రాకుండా చూడాలని సూచించారు. ఈనెల 30న నిర్వహించే రైతు పండగ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో రాజమల్లు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్ ఏఎస్పీగా ఉపేంద్రరెడ్డి

నిర్మల్ టౌన్: నిర్మల్ ఏఎస్పీ(అడ్మిన్)గా ఉపేంద్రరెడ్డిని నియమిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన సూర్యనారాయణ స్థానంలో ఉపేంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించిన న్నారు. ఉపేంద్రరెడ్డి గతంలో నిర్మల్ డీఎస్పీగా పనిచేశారు.

యోగా నిత్యజీవితంలో భాగం కావాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: యోగా నిత్య జీవితంలో భాగం కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. స్థానిక జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా శిక్షణ కేంద్రాన్ని వైద్యశాఖ అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జీవితానికి యోగా ఎంతో ముఖ్యమని, ప్రతిఒక్కరూ యోగా చేస్తూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. యోగా కేంద్రంలో నిపుణులతో శిక్షణ అందిస్తారని తెలిపారు. యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం యోగా సాధనతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు నయం అవుతాయన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. యోగా శిక్షణ కేంద్రానికి అనుబంధంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 10 యోగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ యోగా చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, ఆర్ఎంవో సుమలత, ఆయుష్ విభాగపు వైద్యాధికారి గంగాదాస్, డీసీఎచ్ సురేశ్, తహసీల్దార్ రాజు, అధికారులు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

భూసేకరణ పకడ్బందీగా చేయాలి

కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీకి సంబంధించి భూసేకరణ ప్రక్రియను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వివరాలు ఆయా మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా మండల స్థాయిలో రైతుల కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి వారి సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పథకంలో భాగంగా భూసేకరణకు సంబంధించి సర్వేను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహణలో అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేశ్‌కుమార్, ఏఈఈలు మీరాజుద్దీన్, గంగాధర్, తహసీల్దార్లు ప్రవీణ్, శ్రీదేవి, రాజు, మల్లేశ్, అజీజ్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికలలో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. భారత ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే నాయకులు, పార్టీలు ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నాయని వెల్లడించారు.


జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌పై సన్నద్ధత సమావేశం



సమావేశంలో డీఈవో, అధికారులు

నిర్మల్ రూరల్: డిసెంబర్ మొదటివారంలో నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌పై డీఈవో రామారావు మంగళవారం సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ ప్రదర్శనకు జిల్లాలోని మండలాల నుంచి దాదాపు 500లకు పైగా ప్రదర్శనలు వస్తాయని అంచనా వేశారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం నిర్వహణ తేదీలు, స్థల నిర్ణయం, విద్యార్థుల సంఖ్య, వివిధ కమిటీల ఏర్పాటు, ఆర్థిక అవసరాలు, భోజన వసతి, బస ఏర్పాటు, రవాణా సౌకర్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, న్యాయ నిర్ణేతలు, మెమొంటోలు, సర్టిఫికెట్లు మొదలగు అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు. అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో కోరారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, డీఎస్‌వో వినోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ ఎస్‌వోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణఖేడ్‌కు చెందిన తోట ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆంధ్ర నాట్యం, పేరిణి నాట్యం, శ్రీసమ్మోహన నాట్యం ప్రదర్శించారు. కళాకారులను ఈవో విజయరామారావు అభినందించారు

ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగమే ఆత్మ


- కలెక్టర్ అభిలాష అభినవ్
- కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగం ఆత్మ వంటిదని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని కొనియాడారు. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు, ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. నాటి మేధావుల కృషితో మనకు పటిష్ఠమైన రాజ్యాంగం లభించిందన్నారు. అధికారులు, ప్రజలు రాజ్యాంగ విలువలు పాటిస్తూ దేశ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనదే అతిపెద్ద రాజ్యాంగం

- ఎస్పీ జానకీషర్మిల



రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా.. భారత రాజ్యాంగానికి ప్రపంచ దేశాలలో ఎంతో గుర్తింపు ఉందని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. మనమంతా రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తూ.. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలను అందించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించడంతోపాటు, ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపర్చారని చెప్పారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యాలుగా ఏర్పడిన పోలీసు వ్యవస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తూ.. సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం



మాట్లాడుతున్న లచ్చిరాం

నిర్మల్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మంగళవారం మాట్లాడుతూ.. సర్వే విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని, గౌరవప్రదమైన గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది పదో తరగతి మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు డబ్బులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే బడ్జెట్ విడుదల చేయాలన్నారు. 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయుల నియామకపు తేదీని అక్టోబర్ 10 నుంచి లెక్కిస్తూ వేతనాలు చెల్లించాలన్నారు. ఇందులో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.మురళీమనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, ఎన్.శరత్‌చందర్‌రెడ్డి, పోల ధర్మరాజ్, జాదవ్ బలిరాం పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

- డీఈవో రామారావు



పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలను మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, పాఠశాల మైదానం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పదో తరగతి సిలబస్, పరీక్షలు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్యూలో నిల్చుని మధ్యాహ్న భోజనం రుచి చూశారు. డీఈవో వెంట హెచ్ఎం విజయ స్వప్న, విద్యాశాఖ ఎస్‌వో లింబ్యాద్రి ఉన్నారు.



అతిథుల కిలకిలలు

- శీతాకాల విడిదికోసం చెన్నూర్ అటవీ ప్రాంతానికి పక్షుల వలస
- గోదావరి, ప్రాణహిత తీరంలో సందడి
- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం రాకతో వెలుగులోకి..

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ బృందం సభ్యులు రెండురోజుల పాటు పర్యటించారు. సౌత్ ఆఫ్రికా నుంచి వివిధ రకాల పక్షులు, సీతాకోక చిలుకలు వలస వచ్చినట్లు గుర్తించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని శివ్వారం, గొల్లవాగు ప్రాజెక్ట్, అర్బన్ ఏకో పార్క్‌లలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్, హర్షన్, సోహన్ నాలుగు రోజుల క్రితం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో సర్వేశ్వర్, చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో చెన్నూర్, మంచిర్యాల, నీల్వాయి రేంజ్ అధికారులతో కలిసి పక్షి జాతులపై సర్వే నిర్వహించారు. చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో ఉండడంతో అరుదైన పక్షులు సౌత్ ఆఫ్రికా నుంచి శీతాకాల విడిది కోసం వలస వస్తున్నాయి. చెన్నూర్ అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులు, 72 రకాల సీతాకోకచిలుకలను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు. – చెన్నూర్

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని పాత థియేటర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు అనిల్ కథనం ప్రకారం.. రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లగా రాత్రి సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇస్త్రీకి వచ్చిన బట్టలు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాన్సీనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన రాజశేఖర్ మంగళవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా జాన్సీనగర్ వద్ద ఎదురుగా వచ్చిన క్యాంపర్ వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

మూడు మూగజీవాలు సజీవ దహనం

ఉట్నూర్‌రూరల్: విద్యుదాఘాతంతో మూడు మూగజీవాలు సజీవ దహనమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగంగాపూర్‌కు చెందిన సాగల సాయన్న సోమవారం రాత్రి తన రెండు ఎడ్లు, ఆవును పశువుల పాకలో కట్టేశాడు. విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగడంతో మూడు మూగజీవాలు సజీవ దహనమయ్యాయి. వాటితో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, పంటలకు వినియోగించే మందులు దగ్ధమయ్యాయని, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ అన్నారు. సోమవారం ఉట్నూరు డిపోకు చెందిన బస్సు ఢీకొట్టి జైనథ్ మండలంలో ఇద్దరు మృతి చెందడంతో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రతీ ఉద్యోగి పాటుపడాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో పొగమంచు వలన సైతం ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై దయానంద్ పాల్గొన్నారు.

వరంగల్ హైవే భూపరిహారం పెంపు


ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి టేకుమట్ల, ఎల్కంటి, నర్సింగాపూర్, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, రొమ్మిపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న వరంగల్-విజయవాడ నేషనల్ హైవే రోడ్డులో నష్టపోతున్న భూములకు ఎకరాకు సుమారు రూ.20 లక్షల వరకు పరిహారం పెంచినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. మంగళవారం రొమ్మిపూర్ శివారులో రైతులతో మాట్లాడారు. చెట్లు, బోర్లు, పైపులు నష్టపోతున్న రైతులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకుముందు నర్సింగాపూర్, కుందారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి గన్నీ సంచుల కొరతలేకుండా చూడాలని ఆదేశించారు.

విరిగిన 33కేవీ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో సపోర్టు వైరు తెగిపోవడంతో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో అర్లి(టి) సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఏఈ తిరుపతి రెడ్డి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలి

- బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: ప్రజాస్వామ్య దేశంలో ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగంలో పొందుపర్చబడిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను గౌరవించాలని బాసర ట్రిపుల్ ఐటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం శాశ్వతమైన విలువలను, మార్గదర్శక సూత్రాలుగా కొనసాగిస్తుందన్నారు. ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ మన వ్యవస్థలన్నీ రాజ్యాంగంతో ముడిపడి ఉంటాయన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, కన్వీనర్ డాక్టర్ అజయ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓరియంట్ కంపెనీ పనుల అడ్డగింత


పనులు అడ్డుకుంటున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ గుట్ట ప్రాంతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ వేస్తున్న హద్దురాళ్ల పనులను మంగళవారం స్థానిక ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు, పీసా గ్రామ సభ లేకుండా గుట్ట ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. కంపెనీ యాజమాన్యం దొంగచాటుగా హద్దులు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కంపెనీ సున్నపురాయి లీజు పొడిగింపులో అటవీ భూములు తీసుకుంటుండటంతో రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఆధ్వర్యంలో రొట్టెపల్లి ప్రాంతంలో కంపెనీ భూములు తీసుకుని అటవీశాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంతో అడ్డుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, కోవ వినోద్, చిక్రం రాందాస్, సిడం తిరుపతి, చిక్రం లింగారావ్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన కేసులో జీవితఖైదు

కుభీర్(ముధోల్): భార్యను చంపిన కేసులో భర్తకు జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ మంగళవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రలోని సిరంజనికి చెందిన బాలాజీకి మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన నవనీతతో 2011లో వివాహమైంది. భార్యపై అనుమానం పెంచుకున్న బాలాజీ తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవకు దిగేవాడు. పెద్దలు నచ్చజెప్పడంతో మండలంలోని రాజూరాకు మకాం మార్చారు. అక్కడ కూడా గొడవలు జరగడంతో నవనీత పుట్టింటికి వెళ్లిపోయింది. 2020 అక్టోబర్ 1న బెల్గాంకు వెళ్లి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ 12న మృతి చెందింది. మృతురాలి బంధువు ముదుగుల పరశురాం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ఉమేశ్ కేసు నమోదు చేయగా ఎస్సై ఎల్.ప్రదీప్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ 20మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పు నిచ్చారు.

బాసర హుండీల లెక్కింపు

- 89 రోజుల ఆదాయం రూ.1,00,30,657


హుండీ లెక్కింపులో సేవా సమితి సిబ్బంది

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం ఆలయ అక్షరాభ్యాస మండపంలో ఈవో విజయరామారావు, వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ ఆధ్వర్యంలో లెక్కించారు. 89 రోజుల హుండీ ఆదాయం రూ.1,00,30,657 నగదుతోపాటు మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 4.250 కిలోలు వచ్చినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ నోట్లు 147 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఎస్‌బీఐ బ్యాంక్, పోలీసు సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటీ సభ్యులు, శ్రీశైల భ్రమరాంభిక సేవాసమితి కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య


గులాల్ సర్కార్ మృతదేహం

ఆసిఫాబాద్: భార్య చేతిలో భర్త హతమైన సంఘటన కాగజ్‌నగర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామానికి చెందిన గులాల్ సర్కార్ (44) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గులాల్ సర్కార్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం కూడా దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య సరస్వతి క్రికెట్ బ్యాట్‌తో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కమలా సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సందీప్ పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉత్తరాఖాండ్‌లోని హరిద్వార్ ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో హాజీపూర్ మండలం ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ప్రకాశ్‌రాథోడ్ బంగారు పతకం సాధించాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమ్యారాణి, పీఈటీ కిరణ్‌కుమార్, అధ్యాపక బృందం సదరు విద్యార్థిని అభినందించారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- సర్వీస్ బుక్‌లో సంతకం చేయడం లేదని అఘాయిత్యం
- ఆర్డీవో కార్యాలయంలో పురుగుల మందు తాగిన వైనం


డీఏవో చాంబర్ ఎదుట బాధితుడు

కైలాస్‌నగర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన గంట అభిషేక్ వీఆర్ఏగా పనిచేస్తూ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. 2021లో అదే మండలంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎర్రం నరేందర్‌తో పాటు వీఆర్ఏగా ఉన్న అభిషేక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. విచారణను ఎదుర్కొన్న నరేందర్ ప్రస్తుతం ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీపై వచ్చారు. అయితే ఇతరశాఖలో సర్దుబాటు అయిన అభిషేక్ ఇంకా సస్పెన్షన్‌లోనే ఉన్నారు. ఆయన ఇతరశాఖలో సర్దుబాటు అయిన ఆ ఉద్యోగి సర్వీస్ బుక్‌లో సంబంధిత తహసీల్దార్ సంతకం తప్పనిసరిగా అవసరముంది. దీంతో ఆదిలాబాద్ డీఏవోగా పనిచేస్తున్న నరేందర్ వద్దకు సంతకం కోసం వచ్చారు. ఆయన నిరాకరించడంతో వేదనకు గురైన అభిషేక్ సదరు అధికారి ఎదుటే పురుగుల మందు తాగాడు. దీంతో ఆందోళనకు గురైన ఆర్డీవో, కలెక్టరేట్ ఉద్యోగులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు ఆరా తీశారు. ఈ విషయమై ఆర్డీవో వినోద్ కుమార్‌ను సంప్రదించగా ఇతర శాఖలో సర్దుబాటు అయిన ఉద్యోగి ఎస్ఆర్‌లో ప్రొసీడింగ్ ప్రకారం సంబంధిత తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా జిల్లా కేంద్రానికి వచ్చి డీఏవోను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారన్నారు. ఎదైనా సమస్య ఉంటే సంబంధిత కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే సదరు వ్యక్తి ఘలాట సృష్టించాడన్నారు. సదరు వ్యక్తిపై డీఏవో స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల బెల్లంపల్లిలోజరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, వర్షిత్, చరణ్ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 27నుంచి హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.నారా యణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 29న ఫుడ్‌పాయిజన్‌తో దాదాపు 60 మంది గిరిజన విద్యార్థినులు ఆస్పత్రిలో చేరగా శైలజ మాత్రం 25 రోజులుగా వెంటిలేటర్‌పై ఉండి సోమవారం తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

జైపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఐకే1ఏ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, మధుకర్ పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


తిరుపతి (ఫైల్)

మంచిర్యాలక్రైం: అనారోగ్యంతో ఉన్న భార్యను చూసేందుకు అత్తారింటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి భరతపు తిరుపతి (31) భార్య సోనియాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వారం రోజుల క్రితం కాలేజీరోడ్‌లోని పుట్టింటికి వెళ్లింది. భార్యను చూసేందుకు తిరుపతి సోమవారం రాత్రి బైక్‌పై అత్తారింటికి బయలుదేరాడు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి..

తిరుపతి బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన తీరును పరిశీలిస్తే హెల్మెట్ పెట్టుకొని ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనలో అతని తలకు మాత్రమే బలమైన దెబ్బతగలడంతో మృతి చెందినట్లు చెబుతున్నారు.

కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయి దహనం

- 64 కేసుల్లో 522.544 కిలోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 2021 నుంచి వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని ఇన్సినేటర్ ఫ్యాక్టరీలో మంగళవారం దహనం చేసినట్లు సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసుల్లో పట్టుబడిన రూ.1,30,38.600 విలువైన 522.544 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి ఎఫ్ఎస్ఎల్ కొరకు శాంపిల్ తీయగా మిగిలిన మొత్తాన్ని కరీంనగర్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉందన్నారు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయించే, సేవించే వారి వివరాలు పోలీసులకు తెలియజేస్తే సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, సీసీఆర్‌బీ సీఐ సతీష్, ఆర్ఐ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదలు, ప్రభుత్వ రంగాల పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీనివాస్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలపై కేసు నమోదు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్, సయ్యద్ ఆరీఫ్ వరుసకు సోదరులు. బషీర్ గతేడాది ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి భూమిని రూ.1.20 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరీఫ్ ఆయనకు పోటీగా ఈ ఏడాది రూ.1.50 లక్షలు చెల్లించి కౌలుకు తీసుకుంటానని భూయజమానికి చెప్పాడు. ఈ విషయంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇరు కుటుంబాలు దాడులకు పాల్పడడంతో సయ్యద్ ఆరీఫ్, షేక్ హీనా, జుబేర్, సాదిక్, బషీర్, తాహేర్‌కు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు.